మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## ప్రతి గడపకు అయోధ్య రామ మందిరం అక్షింతల పంపిణీ..



**ఇటిక్యాల,డిసెంబరు 26 ప్రభాతవార్త :** అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను గ్రామ గ్రామాన గడప గడపకు పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా సోమవారం జింకలపల్లి గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు కలసి ఎర్రవల్లి గ్రామంలోని శివాలయం నుండి ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అక్షింతల పంపణీ చేపట్టగా జింకలపల్లి గ్రామం తరపు నుంచి గ్రామ పెద్దలు వెళ్లి రామమందిరం అక్షింతలను తీసుకొచ్చి భక్తి శ్రద్ధలతో ఊరేగింపుతో గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన స్వామివారి అక్షింతలను గ్రామంలోని గ్రామ పెద్దల సహకారంతో ప్రతి గడప గడపకు చేరే విధంగా గ్రామ పెద్దలు పంపిణీ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని అదేవిధంగా కొత్త ఏడాది జనవరి 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం జరుగుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకొని ప్రతి ఒక్కరు పండగలా జరుపుకునే విధంగా చూడాలని అదేరోజు రాత్రి ప్రతి ఇంటిపై 5 దీపాలు వెలిగించాలని హిందూ భక్తులకు సూచంచారు. ఇది మనం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూసి ఎంతో మంది హిందూ ప్రజల ప్రాణ త్యాగాల ఫలితమని అయోధ్య రామమందిరం హిందువుల కల అని 472 సంవత్సరాల తరువాత ఎన్నో పోరాటాలతో నాలుగు లక్షల మందికిపైగా రామ భక్తులు ఈ పోరాటంలో తమ ప్రాణాలను బలిదానం ఇచ్చారని గుర్తు చేశారు. అంతేకాక అయోధ్య రామమందిరం నిర్మాణం కొరకు 2020 ఆగస్టు 5వ తేదీన శంకుస్థాపన చేయడం జరిగిందని ఇందుకు శతాబ్దాల భారతీయుల స్వప్నం సహకారమైందని దీంతో జై శ్రీరామ్ జై శ్రీరామ్ అంటూ దేశము మొత్తం కొనియాడుతున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బిజెపి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాలమూరుకు సి దామోదర రాజనర్సింహ..

**జిల్లా ఇంఛార్జి మంత్రిగా తొలిసారి రాక..కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమీక్ష**



**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 26 ప్రభాతవార్త :** రాష్ట్ర వైద్యారోగ్య, ఆరోగ్య,కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి సి.దామోదర రాజనర్సింహ బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఒకరోజు జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి ఉదయం 10.30 గం.లకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల అతిథి గృహం చేరుకుంటారు. అక్కడ అధికారులు, అనధికారులను కలిసిన అనంతరం ఉదయం 11 గం.లకు సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయానికి చేరుకుని జిల్లాస్థాయి సమీక్ష సమావేశానికి హాజరు కానున్నారు. సమీక్ష సమావేశం అనంతరం మంత్రి మధ్యాహ్న 2 గం.లకు తిరిగి హైదరాబాద్ వెళ్లనున్నారు.

## గురువుస్థానం మహోన్నతమైనది..

**అవధూత మఠంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు**

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 26 ప్రభాతవార్త :** గురువుస్థానం మహోన్నతమైనదని ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని భగవంతుని దృష్టిలో అందరు సమానులేనని ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. మంగళవారం దత్తజయంతి సందర్భంగా సద్గురు అవధూత నర్సింహ స్వామి మఠంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలతో పాటు డోలారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మఠం కమిటి సభ్యులు ఎమ్మెల్యేను శాలువా, జ్ఞాపికతో సత్కరించి ఆశీర్వచనాలతో పాటు స్వామి వారి ప్రసాదాలను అందించారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

అంతకు ముందు నిర్వాహకులు స్వామివారికి అభిషేకం, పాదుకపూజ యజ్ఞం, డోలారోహణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మఠం కమిటి సభ్యులు, మహిళలు, కాంగ్రెస్ నాయకులు మనోహర్‌గౌడ్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మనం చేసే అభివృద్ధి పనులు ఇతరులు మాట్లాడే మాటలకు సమాధానం కావాలి..

**జంగమాయపల్లి,బలిజపల్లి గ్రామంలో కృతజ్ఞత సమావేశంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్26, ప్రభాతవార్త :** మనం చేసే అభివృద్ది పనులే ఇతరులు మాట్లాడే మాటలకు సమాధానం కావాలని ప్రతి ఒక్కరు సమయమనం పాటించి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం పెద్దమందడి మండలం జంగమాయపల్లి, బలిజపల్లి గ్రామంలో కృతజ్ఞత సమావేశాన్ని గ్రామస్థులతో కలిసి నిర్వహించారు. ముందుగా గ్రామంలోని షిరిడి సాయి బాబ, కొమ్ముల గట్టు వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో వేర్వురుగా ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు.



కృతజ్ఞత సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గా ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారి తమ గ్రామాలకు విచ్చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి జంట గ్రామాలైన జంగమాయపల్లి, బలిజపల్లి గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టి ఉద్దేశించి నిర్లక్ష్యంగా మాట్లాడిన వారికి గ్రామాల్లో మనం చేపట్టే అభివృద్దే పనులే సమాధానమవ్వాలన్నారు. జంట గ్రామాలను తన దృష్టిలో ఉంచుకుని మొదటి ప్రాధాన్యతగా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రత్యేక స్థలాన్ని గుర్తించి నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజి జెడ్పీటిసి రమేష్ గౌడ్, మాజి వైస్ ఎంపీపీ సుభాష్ గౌడ్, పార్టి జిల్లా కార్యదర్శి గిరిజ, తదితరులు పాల్గొన్నారు.



ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

## ప్రజా పాలనను విజయవంతం చేయాలి..

**షెడ్యూల్ ప్రకారం గ్రామాలు వార్డులకు వెళ్లాలి**

**శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 26 ప్రభాతవార్త :** ఈనెల 28 నుండి జనవరి 6,2024 వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. మంగళవారం ఆయన సమీకృత జిల్లా అధికారులకు కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజాపాలన కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

ప్రజాపాలన నిర్వహణపై ప్రభుత్వ సూచనలు, సలహాలు తప్పకుండా పాటించాలని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు మాట్లాడుతూ ప్రజాపాలన బృందాలు సమయపాలన పాటించాలని, షెడ్యూల్ ప్రకారం గ్రామ గ్రామాలు వార్డులకు వెళ్లాలని, ముందుగానే గ్రామాలకు వెళ్లాలని, ప్రజాపాలన నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని చెప్పారు. గ్రామ సభలు నిర్వహించే గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వద్ద తాగునీరు, నీడకోసం టెంటు, క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిఆర్‌డిఓ యాదయ్య మాట్లాడుతూ ప్రజాపాలన సందర్భంగా మండల స్థాయి బృందాల ఏర్పాటు, గ్రామసభ నిర్వహణపై ముందుగానే గ్రామాలలో టాంటాం ద్వారా ప్రచారం చేయటం, షెడ్యూల్ తెలియజేయడం, తదితర అంశాలపై వివరించారు. అదనపు ఎస్పీ రాములు మాట్లాడుతూ ప్రజాపాలన సందర్భంగా గ్రామాలు, వార్డులలో బృందాలకు తోడుగా సబ్ ఇన్స్‌పెక్టర్లు, పోలీసులను ఏర్పాటు చేయడం జరుగుతుందని, తహసిల్దార్ ఎంపిడిఓలు స్థానిక ఎస్ఐలతో సమన్వయం చేసుకొని కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలని కోరారు. జడ్పీ సీఈఓ జ్యోతి, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.



హాజరైన అధికారులు

# ఆర్టీసీ బస్సులతో అవస్థలు..!!

**- స్టేజీలలో ఆపడంలేదని బాలికలు,మహిళల ఆవేదన..**

**- బస్సుల సంఖ్య పెంచాలని మహిళల డిమాండ్..**



**భూత్పూర్,డిసెంబర్ 26,ప్రభాతవార్త :** ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకం అమలులో భాగంగా అధికారం చేపట్టిన మరుక్షణం సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణించే వీలుగా ఫైల్‌పై తొలిసంతకం చేశారు.ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద తెల్లరేషన్‌కార్డుదారులకు రు.10లక్షల వరకు కార్పొరేట్ వైద్యం అందించే ఫైల్‌పై కూడా తొలి సంతకం చేశారు.అయితే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల మహిళలు అధికంగా బస్సుల్లో ప్రయాణించేందుకు సిద్దమయ్యారు. ఎన్నడూ ప్రయాణం చేయని మహిళలు సైతలు ఆధార్ కార్డు పట్టుకుని ప్రయాణాలు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రతి స్టేజి వద్ద బస్సు ప్రయాణం కోసం ఆధార్ కార్డులతో బాలికలు,మహిళలధిక సంఖ్యలో కన్పిస్తున్నారు.కొన్ని చోట్ల మహిళలు,బాలికలు అధిక సంఖ్యలో బస్సు కోసం వేచి ఉండగా సదరు బస్సులు సరైన స్టేజిల వద్ద ఆపకుండా వెళ్తున్నారని పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా భూత్పూర్‌లాంటి అంతర్‌రాష్ట్ర,జాతీయ రోడ్ల కూడళ్లలో జనం ముఖ్యంగా బాలికలు,మహిళలు తండోపతండాలు దర్శనమిస్తుండడంతో బస్సు డ్రైవర్లు కొందరు తమకెందు కొచ్చిన గొడవ అంటూ గేర్ మార్చి ఆపకుండా పోతున్నారనే విమ ర్శలు మహిళల నుంచి బాహాటంగా వినవస్తున్నాయి.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధా న్యతనిచ్చి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే దాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాలికలు,మహిళలు ఎక్కువ సంఖ్యలో రోడ్లపైకి వసుండగా,కొన్ని బస్సులు ఆపకుండా వెళ్తుండడంతో నిరాశతో వెనుదిరిగే పరిస్థితి ఏర్పడుతోందని పలువురు మహిళలు,బాలికలు,కళాశాల విద్యార్థినులు ఆవేదనతో పాటు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ బస్సు చూసినా నిండు ప్రయాణీకులతో దర్శనమిస్తుండడంతో బస్సుల డ్రైవర్లు కొందరు స్టేజీలపై నిలపడంలేదని తెలుస్తోంది.రూట్ బస్సులు తక్కువ సంఖ్యలో ఉండడం,మహిళా ప్రయాణీకులకనుగుణంగా బస్సులు లేకపోవడం ఆర్టీసీ ప్రయాణం మరింత భారమైందని పలువురు మహిళలు,బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత ఆర్టీసీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం మహిళలు,బాలికలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకునేందుకు బస్సుల సంఖ్యను పెంచి ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని నెరవేర్చే దిశగా ఆలోచించాలని,మహిళలు,బాలికలు స్టేజిలపై ఎదురుతెన్నులు చూసేటట్లు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని,ఆర్టీసీ బస్సు డ్రైవర్లకు ప్రతి స్టేజిపై బస్సులను విధిగా నిలిపి తమ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులో తేవాలని,ఈ దిశగా సంబంధిత ఆర్టీసీ అధికారులు తమ డ్రైవర్లకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేయాలని మహిళలు,బాలికలు కోరుతున్నారు.

## ప్రజా ప్రతినిధులు పట్టించుకోరా...?

**రహదారి విస్తరణలో అక్రమాలు అరికట్టండి**

**విజిలెన్స్ మానిటరింగ్ కమిటికి ఫిర్యాదు చేస్తాం**

**ఆందోళనకు దిగిన బాధితులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 26 ప్రభాతవార్త :** కోదాడ నుంచి జడ్చర్ల మీదుగా రాయిచూర్ వరకు విస్తరణ జరుగుతున్న ప్రధాన రహదారిపై పనులు చేస్తున్న జాతీయ రహదారుల శాఖ అధికారులు, రహదారి కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమకు నచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తున్నారని ఆరోపిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఎల్ఐసి కార్యాలయం నుండి కల్వకుర్తి రోడ్డులోగల డిగ్రీ కళాశాల వసతి గృహం వరకు నిర్వహిస్తున్న పనులలో నాణ్యత లోపంతో పాటు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించడం లేదని, అధికారులు కాంట్రాక్టర్లు ఆడిందే ఆట పాడిందే పాటగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. అందుకు ఉదాహరణగా ప్రస్తుతం నిర్మిస్తున్న మురుగు కాలువ కొలతలలో ఒకవైపునకు కుదించి మరోవైపు ఉన్న భవనాల యజమానులకు నష్టం జరిగే విధంగా ఒకేవైపు మురుగు కాలువను డైవర్షన్ చేస్తూ మలుపు తిప్పుతూ నిర్మాణం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. గతంలో ఉన్న పాత రోడ్డును కొలిచి అందులో సెంటర్ పాయింట్ ఆధారంగా 100ఫీట్లు రోడ్డు విస్తరణ చేయాల్సి ఉండగా అధికారులు తమకు ఇష్టం వచ్చినట్లుగా నచ్చిన రీతిలో నిర్మాణం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్డు పక్కన గుంతను తవ్వి పాత మట్టిని తీసివేసి కొత్త మొరంతో రూలింగ్ చేయాల్సి ఉండగా ఇవేమి పట్టని కాంట్రాక్టర్లు కొత్తమొరం పోయాల్సిన స్థానంలో పాత మట్టిని వేసి రూలింగ్ చేస్తున్నారని జడ్చర్ల జనం ఆరోపిస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు తమకు రావలసిన రావాల్సిన లాభాలు, కావాల్సిన కమిషన్లు చూసుకొని పనులను తూతూ మంత్రంగా పర్యవేక్షిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. అధికారులు మధ్యలో ఉండి అనగా రెండు వైపులా ఫీట్లు 50 ఫీట్లు విస్తరణ చేయాల్సి ఉండగా ఒకవైపు 60 ఫీట్లు మరో వైపు 40 ఫీట్లు కొన్నిచోట్ల 30 ఫీట్లు 70 ఫీట్లుగా నిర్మాణం చేస్తూ తమకు నచ్చిన వారిని కాపాడుతూ నచ్చని బిల్డింగ్ యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణంలో జరుగుతున్న అక్రమాలపై మాకు న్యాయం జరగకపోతే మున్సిపల్ శాఖ అధికారులకు, రహదారుల భవనాల నిర్మాణ శాఖకు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటికి ఫిర్యాదు చేస్తామని, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, తాజీ, మాజీ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని న్యాయం చేయాలని, రహదారి పనులు పారదర్శకంగా నిర్వహించాలని బాధితులు వేడుకుంటున్నారు.



నిరసన తెలుపుతున్న బాధితులు (ఫైల్)



కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

## ప్రజా పాలన కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలి...

**సంబంధిత అధికారుల సమావేశంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్26, ప్రభాతవార్త :** ప్రజా పాలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలోని ప్రజావాణి సమావేశ మందిరంలో ప్రజాపాలన కార్యక్రమంపై జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తాసిల్దార్లు, ఎంపిడివోలతో సమావేశమై అధికారులకు దిశా నిర్దేశం నుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని ఈ నెల 28 నుండి జనవరి 6, 2024 వ తేది వరకు జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటిలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించాలని గ్రామ స్థాయి , మండల స్థాయి, పట్టన స్థాయిలలో అవసరమైన అధికార బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించారు. నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని, అలాగే మండలానికి ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక గ్రామ పంచాయతీలో ,మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మరో గ్రామ పంచాయతీలో , అలాగే మున్సిపాలిటి వార్డులో సైతం కార్యక్రమాన్ని నిర్వహించి అర్హులైన లబ్దిదారుల నుండి దరఖాస్తులను తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ సభల నిర్వహణలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులో ముందుగానే ప్రజలకు అవగాహన కల్పించేందుకు టాంటాం వేయించాలన్నారు. గ్రామ సభ కోసం సిబ్బందిని నియమించాలని, దరఖాస్తుల స్వీకరణ కోసం కౌంటర్లు ఏర్పాటు చేసుకోవాలని, పట్టణ ప్రాంతాల్లో ఆయా వార్డులో సైతం, మేజర్ గ్రామాల్లో ఎక్కువ కౌంటర్లు ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. గ్రామ సభ నిర్వహణ సందర్భంగా లబ్దిదారులకు తాగునీరు, దరఖాస్తుల స్వీకరణలకు కౌంటర్ల వద్ద షామీయానాను ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసే భాధ్యత ప్రతి ఒక్క అధికారిపై ఉందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవిన్యూ తిరుపతిరావు, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, తాసిల్దార్లు, ఎంపీడివోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు , ఎంపిఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి..

**ప్రజలతో సున్నితంగా మెలగాలి**

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 26 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఈనెల 28 నుండి వచ్చేనెల 6 (జనవరి 2024) వరకు అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులలో జరిగే ప్రజాపాలన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వారం రోజుల పాటు కొనసాగే ప్రజా పాలన కార్యక్రమాన్ని అధికారులు, ఉద్యోగులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఈనెల 28న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తుందని అందులో భాగంగా నారాయణపేట జిల్లాలోనూ ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్న గ్రామాలు, మున్సిపల్ వార్డులలో ఉదయం 8 గం.లకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి, మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి మండలాలు మన జిల్లా పరిధిలో ఉన్నాయని, ఆయా మండలాలలో ప్రజాపాలన కార్యక్రమాన్ని తొలిరోజు పెద్ద ఎత్తున చేపట్టాలని ఆయా మండలాల ప్రత్యేక అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన 6గ్యారంటీలలో 5పథకాలైన మహాలక్ష్మి,రైతుభరోసా, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ వారం రోజుల్లో ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు. అయితే ఇంటికి ఒకే దరఖాస్తు ఇచ్చి, అదే 5 పథకాలకు సంబంధించి లబ్దికోసం ఆధార్ కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ పత్రాలను తప్పనిసరిగా దరఖాస్తుతో జతపరచాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. ఒక్కో దరఖాస్తు పరిశీలనకు 5నుంచి 7నిమిషాలు పట్టే అవకాశం ఉందని, ప్రజలతో సున్నితంగా మెలిగి, ధృవ పత్రాలన్నింటిని నిశితంగా పరిశీలించి దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. ప్రజాపాలన నిర్వహణపై ప్రభుత్వ సూచనలు, సలహాలు తప్పకుండా పాటించాలన్నారు. ప్రజాపాలన బృందాలు సమయపాలన పాటించాలని షెడూనయల్ ప్రకారం గ్రామాలు వార్డులకు వెళ్లాలని, ముందుగానే గ్రామాలకు వెళ్లాలని, ప్రజాపాలన నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని చెప్పారు. గ్రామసభలు నిర్వహించే గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వద్ద తాగునీరు,నీడకోసం టెంటు,క్యూలైన్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ప్రజాపాలన సందర్భంగా మండల స్థాయి బృందాల ఏర్పాటు, గ్రామసభ నిర్వహణపై ముందుగానే గ్రామాలలో టాంటాం ద్వారా ప్రచారం చేయడం,షెడ్యూల్ తెలియజేయడం,తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. ప్రజాపాలన సందర్భంగా గ్రామాలు,వార్డులలో బృందాలకు తోడుగా సబ్ ఇన్స్‌పెక్టర్లు,పోలీసులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తహసిల్దార్, ఎంపిడిఓలు, స్థానిక ఎస్సైలతో సమన్వయం చేసుకుని కార్యక్రమం విజయవంతమయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, జడ్పీ సీఈఓ, జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఏఈవోలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

## మక్తల్ పడమటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నవైద్యారోగ్య‌శాఖ మంత్రి సతీమణి..

**మక్తల్,డిసెంబరు 26 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో శ్రీశ్రీశ్రీ పడమటి ఆంజనేయస్వామి జాతర సందర్భంగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి అటునటువంటి పద్మినిని మక్తల్ ఎమ్మెల్యే వారికి స్వాగతం పలికారు. అనంతరం పడమటి ఆంజనేయస్వామి వారి దర్శనం చేయించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాలతో వారిని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్ పడమటి ఆంజనేయస్వామి దర్శనం చేసుకోవడం మహా పుణ్యభాగమని అలాంటి పుణ్యభాగం తమరికి ఈ పవిత్ర పౌర్ణమి రోజు దర్శనం కలగడం ఎంతో సంతోషకరమని వారన్నారు. వారి వెంబడి నారాయణపేట డిఎంహెచ్ఓ సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి

## జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం..



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్26, ప్రభాతవార్త :** గోపాల్‌పేట మండల కేంద్రంలో మంగళవారం జిల్లా స్థాయి క్రికెట్ టౌర్నమెంట్‌ను కాంగ్రెస్ పా ర్టి మండల ఇంచార్జి సత్యశీలారెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి ఈనెల 31వ తేది వరకు ఈ టౌర్న మెంట్ జరుగుతుందని, గెలుపొందిన విజేత జట్లకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, శివన్న, నాగేశేషుయాదవ్, బాలపీర్, చంద్రశేఖర్, బాలయ్య, శ్రీనివాసులు, మతిన్, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో 28 నుండి ప్రజా పాలన గ్రామసభలు..

**ఖిల్లాగణపురం, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** ఈ నెల 28 నుండి జనవరి 6వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజా పాలన గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో విజయ్ కుమార్ చెప్పారు ప్రజల నుండి ఆరుగ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మహాలక్ష్మి రైతు భరోసా గృహజ్యోతి ఇందిరమ్మ ఇల్లు చేయితో పథకాల కొరకు దరఖాస్తులు చేసు కోవాలని చెప్పారు. దరఖాస్తులు ఇచ్చిన వారికి అధికారులు రసీదులు అందజేస్తామని చెప్పారు. దరఖాస్తుకు సంబంధించిన హారాలు ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 28న ఆగారం అల్లమాయపల్లి కోతులకుంట 29న అప్పారెడ్డిపల్లి సలికలాపూర్ దొంతికుంట తండా 30న ఆనందం బండ తండా కర్నే తండా ఉప్పరపల్లి మల్కిమియన్నపల్లి జనవరి 2న గణపురం కమాలు ద్దీన్పూర్ గట్టుకడిపల్లి పర్వతాపూర్ మూడున సోలిపూర్ మానాజీపేల నాలుగున మల్కాపూర్ షాపూర్ సురాయిపల్లి ఐదున మామిడి తిరుమలాయపల్లి అంతాయపల్లి ఆరున వెనికి తండా వెంకటం పల్లి రోడ్డు మీ తండాలో గ్రామసభలు నిర్వహిస్తామని ఆయా గ్రామాలకు మండల స్థాయి అధికారులు హాజరవుతారని చెప్పారు. ఈ గ్రామసభలలో అన్నిగ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు.

## అమరచింత పట్టణ ఏబీవీపీ నూతన కమిటీ ఎన్నిక..



**అమరచింత, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** అఖిలభారత విద్యార్థి పరిషత్ అమరచింత పట్టణ నూత న కమిటీని మంగళవారం అమరచింత మండల ఏబీవీపీ అధ్యక్షులు అఖిల్ సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు. అమరచింత పట్టణ ఏబీవీపీ అధ్యక్షులుగా, మహంకాళి రాజేష్, ఏబీవీపీ పట్టణ ఉపాధ్యక్షులుగా, తిరుమలేష్, కార్తీక్, ఏబీవీపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా, భరత్, సహాయ కార్యదర్శులు, లోకేష్, భరత్, ఏబీవీపీ పట్టణ కార్యవర్గ సభ్యులుగా, అఖిల్, మహేష్, ఉదయ్, నారాయణలను ఎన్నుకున్నారు.

## నీళ్లు లేక ఇబ్బందులు..



**వనపర్తి టౌన్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలో గాంధీచౌక్ లో విశ్వేశ్వరరెడ్డి హాస్పిటల్ పక్కన నీళ్ల బోర్ చెడి పోయి ఆరు నెలలు అవొతుంది కాన్సిలర్ కీ మున్సి పాలిటీ లో కంప్లైంట్ ఇవ్వటం జరిగింది, కానీ ఇంత ఎవరు కూడా పట్టిచుకోవడం లేదు, కాలనీ వాసులు నీళ్ల లేక తలడీ లు పోతున్నారు. మా యొక్క అవసరాలు దృష్టి పెట్టుకొని బోర్ మార్మాతులు చేయాలాని కాలనీ వాసులు వాపోయారు.

## అమరచింతలో ఘనంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్టాపన..



**అమరచింత, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** అమరచింత పట్టణంలో గతనెలలో ఆయవార్డులలో నెలకొల్పిన నూతన బొడ్రాయి విగ్రహ ప్రతి ష్టాప న 41వ రోజు సందర్భంగా సోమవారం పట్టణం లో 10 వార్డులలో ప్రతిష్టించిన బొడ్రాళ్ల దగ్గర వేద పండితులచే పూర్ణ హారతి, హెూమం పూజ లు వేద పండితులు అంగరంగ వైభవంగా పూ జా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆంజనే య స్వామి దేవాలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సి ఎల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్, బొడ్రాయి ప్రతిష్టాపన మహెూత్స వ కమిటీ నిర్వాహకులు తాటికొండ రమేష్, ఏకే వెంకటేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, వీరితోపాటు భక్తులు భారీగా పాల్గొన్నారు.

## పొగమంచుతో వాహనదారులు ఇబ్బందులు..

**భూత్పుర్, డిసెంబరు 26 ప్రభాతవార్త :** గత రెండు మూడు రోజులుగా వాతావరణం మరింత చల్లబడడంతో జనాలు గజగజ వణుకుతున్నారు. ఉదయం 10 గం.లు దాటిన చలి తీవ్ర తగ్గక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామున రోడ్లను పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పలుచోట్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చేటు చేసుకోవడంతో పిల్లలు



వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. శ్వాసకోశ సంబంధ వ్యాధిగ్రస్తులు బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. తాండూరు మండలం నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న ఆర్టీసి బస్సు పొగమంచు కారణంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని మహ్మదాబాద్ మండలం ఇబ్రహీంబాద్ వద్ద అదుపు తప్పి గుంతలోకి దూసుకెళ్లింది. పొగమంచుకు తోడు రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. ప్రయాణీకులను డ్రైవర్ వేరే బస్సులోకి ఎక్కించారు. వాహన చోదకులు నెమ్మదిగా వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు.

## దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తా:ఎమ్మెల్యే

**కోయిల్‌కొండ, డిసెంబరు 26 ప్రభాతవార్త :** మండలంలో ఉన్న ఆచార్యపూర్ గ్రామ పంచాయతీలో ఉన్న దత్తాత్రేయ దేవాలయం అభివృ ద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పర్ణికరెడ్డి తెలిపా రు. మంగళవారం గాంధినగర్ సమీపంలో ఉన్న ఓంకార ఆశ్రమ 42 వ వార్షికోత్స వానికి, పౌర్ణమి దత్తాత్రేయ జయంతి సందర్భంగా శ్రీశ్రీశ్రీ మాణిక్ దత్తాత్రేయ స్వామివారి ఉత్స వాలకు ఎమ్మె ల్యే హాజరయ్యారు. శ్రీశ్రీశ్రీ దత్తాత్రేయ దేవాల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు



ముందు ఆమెకు నిర్వాహకులు ఘనంగా స్వాగ తం పలికారు. అదేవిధంగా వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వా హకులు రాములునాయక్, వెంకట్‌రాములు, గంగాధర్, దేవేందర్, సంతోష్, జైపాల్, బద్రినాయక్, జానకమ్మ, కాంగ్రెస్‌పార్టీ మండలఅధ్యక్షులు జి.రవిందర్, మల్కాపూర్ మాజీ సర్పంచ్ రాజేందర్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాజీ ఎంపిటిసి యాదవ్‌కుమార్, మండల ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షు లు మోహన్‌రెడ్డి, రామునాయక్, వెంకటేష్ యాదవ్, దిలీప్ శర్మ, నాగరాజు, మంగ్యానాయక్, విక్రమ్ తేజ్‌గౌడ్, గోవింద్ యాదవ్, ప్రభాకర్ యాదవ్, దోని తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా చిన్నరాజమూర్ అంజనేయస్వామి ప్రభోత్సవం..

- రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- అశ్వవాహనంపై ఊరేగిన స్వామివారు
- ఆర్టీసి బస్సుల ఏర్పాటు
- తరలివస్తున్న వేలాది భక్తులు
- భక్తులతో కిక్కిరిసిపోతున్న చిన్నరాజమూర్



భజనలు చేస్తున్న భక్తులు



అశ్వవాహనసేవ నిర్వహిస్తున్న పురోహితులు



స్వామి వారి ప్రభోత్సవ దృశ్యం

**దేవరకద్ర, డిసెంబరు 26 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి స్వామి ప్రభోత్స వ పూజా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్స వానికి ఒ రోజు ముందు ఈ ప్రభోత్స వాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర ప్రభోత్స వం కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్స వాలలో భాగంగా ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహించారు. ఈ నెల 24 నుండి స్వామి వారి ఉత్స వాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామి వారి సన్నిధిలో వైభవపేతంగా ప్రతి రోజు పలు పూజా కార్య క్రమాలను నిర్వహిస్తున్నారు. అలాగే స్వామివారికి పంచా మృతాభిషేకం పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి ఉత్స వవిగ్రహాన్ని అశ్వవాహన సేవపై తీసుకొని దేవస్థానం చుట్టూ ఊరేగించారు. పురోహితుల వేధ మంత్రాలు, సన్నాయివాయిద్యాలు, భక్తుల హరినిమశ్చరణల మద్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది.

**ఘనంగా ప్రభోత్స వం..** ప్రభోత్స వం సందర్భంగా స్వామి వారిని ప్రభవాహనం పై ఊరేగించారు. దేవస్థానం ఆవరణలో వేదమంత్రోశ్చరనల మద్య ఆ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి ప్రభోత్స వానికి వివిద ప్రాంతాలనుండి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రభ వాహనాన్ని లాగ డానికి భక్తులు పోటీపడ్డారు. ప్రభోత్స వం అనంతరం స్వామి వారిని మళ్లీ ఆశ్వవాహనం పై దేవస్థానంలోకి స్వామి వారిని తీసుకెళ్ళి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే గరుడవాహనసేవతో పాటు మహాఅలంకరణ, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ఈ పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో కన్నులపండువలా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌ను వివిధ రకరకాల పూల తో పాటు వివిధ ఆభరణాలతో సార్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారి ఉత్స వ విగ్రహాన్ని కూడ అలంకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ సునిల్‌కుమార్‌చారి, వ్యవస్థాపక వంశీయులు గోపాలచారి, భీమాచారి, రాఘవేంద్రాచారి, ఎ౼నుమేశచారి, పరిమళాచారి, మేనేజర్ ప్రసాద్, గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

**రథోత్స వానికి ఊర్పాట్లు పూర్తి..** దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్స వాల భాగంగా స్వామి వారి సన్నిధిలో ఉత్స వాల బుధవారం తెల్లవారుజామున జరిగే స్వామి వారి రథోత్స వాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి గాను స్వామివారి రథానికి రంగులు వేసి ముస్తాబుచేశారు. దీనికి గాను దేవస్థానం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్స వాలలోని ప్రధానఘట్టమైన ఈ పవిత్ర కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు. ఈ సందర్భంగా స్వామి వారిని రథంపై అశేష జనావళి తిలకిస్తుండగా ఊరేగిస్తారు. అలాగే మహాఅలంకరణ, గజవాహనసేవ, పంచామృతాభిషేకం, వివిధ సంసృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పంచామృతాభిషేకం, మహాఅలంకరణ, గరుఖవాహనసేవ, వివిద సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. అంతేగాకుండా స్వామి వారికి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవస్తానాన్ని వివిద రంగురంగుల బల్బులతో శోభాయమానంగా అలంకరించారు.

**ఆర్టీసి ఏర్పాట్లు..** చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్స వాల సందర్భంగా స్వామివారి రతోత్స వాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ దేవరకద్ర నుండి చిన్నరాజమూర్‌కు ప్రత్యేక బస్సులను ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం ప్రతి ఏడాది జాతరకు ఆర్టీసి ప్రత్యేక బస్సులను నడుపుతుంది. వివిద ప్రాంతాలనుండి భక్తులు బస్సులు, ట్రాక్టర్లు, ఎడ్డుల బండ్లు, వివిద వాహనాలలో చిన్నరాజమూర్‌కు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో భక్తులతో కిటకిటలాడుతుంది. ఎక్కడ చూసిన భక్తులే కనిపిస్తున్నారు.

# లాహెూరులో జరిగిన అల్ ఇండియా,కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సదస్సు ..





**వనపర్తి టౌన్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** వినియోగాదారులా రా తస్మాత్ జాగ్రత్త... అధిక డిస్కొంట్ల ప్రలోభంలో ఆరోగ్యాన్ని తాకట్టు పెట్టకండి, లేనిపోని రోగాలను కొని తెచ్చుకుని భవిష్యత్ తరాలను ప్రమాదంలో నెట్టకండి, నేడు ఏ పేపర్ చూసినా నకిలీ మందులు అమ్మకాలు జోరు అని నకిలీ మందులు సేవించడం వల్ల పేషెంట్లు మృతిచెందారని వివిధ రకాల రోగాల పాలయ్యారని చూస్తున్నాము. మందుల అమ్మకాలను పెంచుకోవాలనే ఉద్దేశంతో కొన్ని రకాల చైన్ షాపులు, ఆన్లైన్ ఫార్మసీస్ అధిక డిస్కొంట్ ల పేరుతో ప్రజలను ఆకర్షించే విధంగా వివిధ రకాల స్కీములను ప్రవేశపెడుతూ ప్రాణ అవసరాలకు వాడుతు ఆరోగ్య పరిరక్షణలో ప్రముఖ పాత్ర వహించే మందులను విచ్చలవిడిగా అమ్ముతున్నాయి. వీరి ఉద్దేశం భారీగా మందులు అమ్ముకోవడం మాత్రమే. వాటి నాణ్యత ప్రమాణం గురించి వీరికి ఏమాత్రం పట్టింపు లేదు. తాము అమ్ముతున్న మందులు నాణ్యత ప్రమాణాలు సరిగి ఉన్నవా లేవా అనిఇ కూడా వీరు ఏ మాత్రం చూసుకోరు. ఈ అమ్మకాలపై ఎలువంటి నియంత్రణ లేనందున రోగులు కొనుగోలు చేసేటప్పుడు కలిగే అవకాశం ఎంతైనా ఉంది. ఆన్లైన్ ఫార్మసీ ద్వారా కొన్న మందులు సరైనవా, కాదా అని తెలిసే అవకాశము ఎంత మాత్రం లేదు, కావున స్థానికంగా ఉండి మీ గురించి పూర్తిగా తెలిసి ఉన్న మందుల షాపుల్లో మాత్రమే మందులు కొనుగోలు చేయండి. స్థానిక కెమిస్ట్ మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మందుల ద్వారా ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వారు వాటిని పరిష్కరించడంలో మీకు సహాయ పడగలుగుతారు. ప్రభుత్వము మందుల ధరలను నిర్ణయించేటప్పుడు హెడ్యూల్ మందులకు 16 శాతం నాన్ షెడ్యూల్ మందులకు 20 శాతం మార్జిన్ మాత్రమే ఉండాలని నిర్ణయించింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే స్థానిక కెమిస్టు.. మందులను విక్రయిస్తారు. అధిక డిస్కొంట్ ఇచ్చి మందులు అమ్ముతూ రోగులను ప్రలోభ పెడుతున్నారంటే ఆ మందుల నాణ్యత ప్రమానాలను సరిచూసుకోవాల్సి వస్తుంది. కావున డిస్కొంట్ల మత్తులో మీ ఆరోగ్యాలను తాకట్టు పెట్టకండి. మీ శ్రేయోభిలాషి స్థానిక కెమిస్ట్ కు ప్రాధాన్యత ఇచ్చి వారి ద్వారా మాత్రమే మందులు కొనుగోలు చేయండి.

స్థానిక కెమిస్ట్ మిమ్మల్ని బాగా ఎరిగిన వ్యక్తి కనుక ఆరోగ్య పరిరక్షణలో తగు జాగ్రత్తలు కూడా మీకు తెలియజేసి మీ ఆరోగ్య పరిరక్షణకు తన వంతు సహాయం అందజేస్తాడు. కావున అధిక డిస్కొంట్లకు ఆశ పడి ఆరోగ్యం పోగొట్టుకోవద్దని ప్రభుత్వము ఆదేశించిన మార్జిన్లకు మందులు అమ్ముతున్న స్థానిక మందుల షాపుల్లో మాత్రమే మందులు కొనుగోలు చేసి మీ ఆరోగ్యాలను, భవిష్యత్ తరాలను కాపాడు కోవాలని కోరుతున్నాము.

ఈ మీటింగ్‌లో పాల్గొన్నా, శ్రీనివాస్ ప్రెసిడెంట్ టీటీసీడా, శ్రీనివాసులు జనరల్ సెక్రటరీ టీటీసీడా, రాజు ట్రేషర్, ఎం.ను వనపర్తి జిల్లా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు వినోద్ కుమార్ ప్రెసిడెంట్ నరసింహ జనరల్ సెక్రటరీ మని కుమార్ ట్రేషర్ తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులుగా కానుగుల శ్రీనివాసులు



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ నాయి బ్రాహ్మణ జిల్లా సంఘం ఎన్నికలు మంగ ళవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో అచ్చంపేట పట్టణానికి చెందిన కానుగుల శ్రీనివాసులు ఏక్రగీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొల్లాపూర్ పట్టణానికి చెందిన టి.సురేష్ ఎన్నుకోబడ్డారు. కోశాధికారిగా కల్వకుర్తికి చెందిన శ్యాం, గౌరవ అధ్యక్షురాలు వనపట్ల సుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా నాలుగు నియోజకవర్గాలకు చెందిన సభ్యులు ఎన్నికయ్యారు. వీరిలో నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన ఎస్.తిరుపతయ్య, కొల్లాపూర్ పట్టణానికి చెందిన ఎం.సత్యం, కల్వకుర్తికి చెందిన కే.జంగయ్య ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా కె.వెంకట్రాములు, ఉపాధ్యక్షులుగా జె.మహేష్, వల్లూరి మహేష్‌లు ఎన్నుకోబడ్డారు. 2017లో మొదటి సారిగా జిల్లా జనరల్ బాడీని నాయిబ్రాహ్మణ సభ్యులు ఏర్పాటు చేశారు. మొదటి నాయి బ్రాహ్మణ జిల్లా అధ్యక్షులుగా వనపట్ల గ్రామానికి చెందిన వనపట్ల సుబ్బయ్య ఐదేళ్ల పాటు తన బాధ్యతలను నిర్వహించారు. అనంతరం నూతనంగా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా పరిధిలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ తాలూకాలకు చెందిన నాయకులతో పాటు 20 మండలాలకు చెందిన నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు ఎన్నికల్లో పాల్గొన్నారు. నాయి బ్రాహ్మణ సంఘానికి చెందిన సభ్యులంతా ఏకాభిప్రాయానికి వచ్చి ఉమ్మడిగా సమిష్టి నిర్ణయం తీసుకొని అచ్చంపేట పట్టణానికి చెందిన కానుగుల శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కానుగుల శ్రీనివాస్ గతంలో అచ్చంపేట పట్టణ అధ్యక్షులుగా, ప్రస్తుతం అచ్చంపేట తాలూకా నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా సేవలు అందిస్తున్నారు. ఈ దఫా జిల్లా అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా నాయి బ్రాహ్మణ సభ్యులు దాదాపుగా 500 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్.బాలస్వామి, ఎన్.నరసింహ, ఎస్.పురుషోత్తం, ఏం.శివుడు, ఎస్.బాలస్వామి, జే.మహేష్, శేఖర్, వై.మల్లేష్, పి.సత్యనారాయణ, సి.బాలరాజు, టి.వెంకటస్వామి ఇతరులు ఉన్నారు.

## అంగరంగవైభవంగా అయ్యప్ప స్వామి మండల మహా పడిపూజ....

### పాల్గొన్న నిరంజన్ రెడ్డి,రావుల చంద్రశేఖరరెడ్డి



**వనపర్తి టౌన్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** ధర్మశాస్త అయ్యప్పస్వామి మహా మండల పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇట్టి పూజా కార్యక్రమము ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ శర్మ సిద్దాంతి, ముత్తు గురుస్వామి, నరేందర్ గురుస్వామి, గట్టు. వెంకన్న గురుస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు నాగేష్, ఆధ్వర్యములో ఘనంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, గోపూజ, అష్ట అభిషేకాలు, చక్రస్నానం, పల్లకి సేవ, భిక్షా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ పూజా కార్యక్రమములో ముఖ్య అతిధిగా నిరంజన్ రెడ్డి, రావుల చంద్రశేఖరరెడ్డి పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీసులు తీసుకొని గురుస్వాములను మరియు నారికేళ గురుస్వామి బీచుపల్లి, సన్మానిచారు. ఈ సందర్భంగా రావుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఆలయ కమిటీ పూజా కార్యక్రమము ఘనంగా జరిగింది. అని మండల పూజ నా చేతుల మీదుగా జరగడం నా పూర్వజన్మ సుకృతం అని ఈ పూజ నిర్వహించడం ద్వారా ఆత్మసంతృప్తి, మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. దేవుడు శక్తి ఇచ్చేవరకు పూజా కార్యక్రమము నిర్వహిస్తానని అన్నారు. అదేవిధంగా అయ్యప్పలు సురక్షితంగా తమ యాత్ర చేయాలని కాంక్షించారు. అయ్యప్పస్వాములతో కలసి నిరంజన్ రెడ్డి, రావుల భిక్ష స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, లక్ష్మి నారాయణ, రగుమా రెడ్డి, ప్రకాష్, నందిమల్ల. అశోక్, అనిల్, పుట్టపాకల. మహేష్, నందిమల్ల. శ్యామ్, నాయకులు పి.రమేష్ గౌడ్, తిరుమల్, ఆవు. రమేష్, జోగు. షాంతన్న, రాజశేఖర్, గౌస్, రమేష్, జేమేల్, నిరంజన్, నందిమల్ల. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానం వద్ద భక్తులకు అన్నదానం..



**దేవరకద్ర, డిసెంబరు26 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చిన్న రాజమూరు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద మంగళవారం భక్తులకు దేవరకద్రకు చెందిన యువ నాయకుడు కొండ అంజన్ కుమార్‌రెడ్డి అన్నదానం చేశారు. ప్రతి సంవత్సరం దేవస్థానం వద్ద బ్రహ్మోత్స వాలలో అంజన్‌కుమార్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా భక్తులకు ఆయన అన్నదానం చేశారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఉచిత మంచినీటిని అందించిన సురేందర్‌గౌడ్ సోదరులు



**మక్తల్, డిసెంబరు 26 ప్రభాతవార్త :** మక్తల్ శ్రీ పడమటి ఆంజనేయస్వామి జాతర సందర్భంగా జాతరకు వచ్చిన భక్తులకు కీ.శే.సురేందర్‌గౌడ్ తనయులు సుమన్‌గౌడ్, పవన్‌గౌడ్‌లు ఉచితంగా త్రాగునీరు అందించారు. గత నాలుగు సంవత్సరాలుగా మక్తల్ పడమటి ఆంజనేయస్వామి జాతరకు వచ్చిన భక్తులకు సేవ చేసుకుంటున్నారు. భక్తులకు ఉచితంగా మంచినీటి సదుపాయాన్ని కలిగిస్తున్నటువంటి సోదరులను పలువురు రాజకీయ ప్రముఖులు అభినందించారు.

## పేదల పక్షాన పోరాడే పార్టీ ఎర్రజెండా పార్టీ..

**అమరచింత, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అమరచింత మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సిపిఐ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనియన్ బ్యాంక్ దగ్గర ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ సిపిఐ సీనియర్ నాయకులు శ్యాం సుందర్ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వాములతో పోరాడి భూమిలేని పేదలకు లక్షలాది ఎకరాలు భూ పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీలకే దక్కిందని ఆయన గుర్తు చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాధక్తం చేస్తుందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక బిల్లులను పార్లమెంటులో ఆమోదిస్తే బిల్లులను రద్దు చేయాలని రైతులు పార్లమెంటు దగ్గర ధర్నా చేస్తే పోలీసుల తో కాల్చి చంపిన కేంద్ర ప్రభుత్వానికి రైతులు తగిన బుద్ధి విధానాలకు వ్యతిరేకంగా దేశంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా ఉండి పోరాటాలకు కలిసి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు భాస్కర్, రవీందర్, మాషప్ప, రఘు, నాగరాజు, లక్ష్మీనారాయణ, సిస్సార్, సాలు పెంటన్న తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో సిపిఐ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న సిపిఐ మండల కార్యదర్శి, అబ్రహం

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం..

**శ్రీరంగాపురం మండలం, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఈరపాగ బిచ్చమ్మ సోమవారము అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయం శ్రీరంగాపురం మండల నాయకులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మరణించిన కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం చేయవలసిందిగా మండల నాయకులను ఆదేశించడం జరిగింది. మండల నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటస్వామి, మండల ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు ఈరపాగ కురుమన్న చేతుల మీదుగా 5000 రూపాయలు మృతురాలు కుమారుడు ఈరపగా రాముడు కు అందించి మృతురాలి పార్తివదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. మండల నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మృతురాలికుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ప్రభుత్వం తరపున పార్టీ తరుపున ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ కోశాధికారి బి.రంజిత కుమార్, మండల యువ నాయకులు పరుశురాముడు, తదితరులు పాల్గొన్నారు.



పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి

## ఎనుముల కొండల్‌రెడ్డికి ఘన స్వాగతం


సీఎం సోదరుడు ఎనుముల కొండల్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి

**ఉప్పునుంతల, డిసెంబరు 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కొండల్‌రెడ్డి అచ్చంపేట నియోజకవర్గంలోని ఉప్పునుంతల మండలానికి రావడంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట అనంతరెడ్డి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. సీఎం సోదరుడితో పాటు అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ హాజంయ్యారు. లత్తిపూర్ గ్రామ పంచాయతీ శివారులో ఉన్న కట్టమైసమ్మ వద్ద సీఎం సోదరుడు ఎనుముల కొండల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ జక్కా చంద్ర శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంఛార్జి గుద్దటి బాలరాజు తదిత రులు పాల్గొని ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

## మొక్కులు చెల్లించిన కంటోనిపల్లి సర్పంచ్


అమ్మవారిని దర్శించుకొని ఎమ్మెల్యేతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్

**వెల్దండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధిస్తే మైసిగండి మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తామని కంటోనిపల్లి గ్రామ సర్పంచ్ పెద్ది రామకృష్ణ మొక్కుకున్నారు. మొక్కు చెల్లింపులో భాగంగా మంగళవారం మైసిగండి మైసమ్మ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయప్రకాష్, సర్పంచ్ గోరటి శ్రీనివాస్, భీరయ్య, పత్యానాయక్, రేవతి రాజశేఖర్, లక్ష్మణ్‌నాయక్, ఉప సర్పంచ్ సురేందర్, శ్రీనివాస్‌గౌడ్, నూకం వెంకటయ్య, నాగరాజు, సీత్యానాయక్, సతీష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## పేదల విముక్తి కోసమే సీపీఐ పోరాటం

**- సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి పులిజాల పరుశరాములు**


సీపీఐ పార్టీ జెండావిష్కరణ చేస్తున్న సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 26, ప్రభాతవార్త:** భూమి కోసం భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి పులిజాల పరుశరాములు అన్నారు కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో సోమవారం సీపీఐ 99వ అవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్ర జెండా పేదలకు అండగా ఉంటుందని, పేద ప్రజల హక్కుల సాధనకు సమరశీల పోరాటం చేస్తుందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేసి పేదల పక్షాన పోరాటం చేసిన ఘనత ఎర్ర జెండా పార్టీకే దక్కిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తుందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉన్నారు.

## ఘనంగా బాక్సింగ్ డే సంబురాలు


బాక్సింగ్ డే వేడుకలో పాల్గొన్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్26, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చ్ ఆవరణలో మంగళవారం క్రైస్తవులు బాక్సింగ్ డేను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా యువకులు క్రికెట్ పోటీలు, చిన్నారులకు, మహిళలకు ఆటపాటల పోటీలు నిర్వహించుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అస్ట్రేలియా నుంచి వచ్చిన సనీత్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన క్రైస్తవులందరికి బాక్సింగ్ డే సందర్భంగా ప్రేమ విందును ఏర్పాటు చేశారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమలో ఎంబీ ఫీల్డ్ చైర్మన్ డాక్టర రెవరెండ్ కేవీ పురుషోత్తం, ఎంబీ చర్చ్ చైర్మన్ కేఎస్.జోసెఫ్, వైస్ చైర్మన్ బీఎన్.సంపత్‌కుమార్, సెక్రటరీ పి.సంపత్‌కుమార్, బీఎన్.ఏలియా, బెంజమిన్, దయానంద్, బి.విజయ్‌కుమార్, వీఎస్.భాస్కర్, హానీ, శ్రీకర్‌బాబు, ప్రదీప్‌కుమార్, కరుణాకర్ బాబు తదితరులు ఉన్నారు.

## ట్రాఫిక్ చాలాన్ల చెల్లింపు రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**వెల్దండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాల చెల్లింపులకు రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అవకాశాన్ని కల్పించిందని, ఈ అవకాశాన్ని వాహనదారులు వినియోగించుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జనవరి 10 2024వరకు పెండింగ్ చాలాన్ల డబ్బులు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. ద్విచక్రవాహనాల చాలాన్లకు 80శాతం,ఆటోలు, ఫోర్ విల్లర్స్‌కు 60శాతం, భారీ వాహనాలకు 50శాతం రాయితీలను ప్రభుత్వం కల్పించిందని,ఇట్టి అవకాశాన్నిమండలంలోని వాహనదారులుసద్వినియోగం చేసుకొని చాలాన్లను చెల్లించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలనుపాటించాలని,మైనర్లకు వాహనాలు అప్ప గించరాదన్నారు.వాహనదారులుఖచ్చితంగానిబంధనలుపాటించాలని సూచించారు.

## ఘనంగా అంజన్నస్వామి బ్రహ్మోత్సవాలు



**ఉట్కూర్,డిసెంబరు26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బిజ్వార్‌ల వెలిసిన శ్రీ వ్యాసరాయల మహర్షిచే ప్రతిష్ఠించిన శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాయంలో అంజన్న స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు స్వామి వారికి ఆలయ పూజారి నరసింహచారి జోషిచే అభిషేకం, పుష్పాలంకరణ, తమలపాకుల సేవతో పాటు స్వామివారిని ప్రత్యేక వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి నైవేద్యం, మహా మంగళహారతితో పాటు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆలయంలో ఆలయ అభివృద్ధి కమిటి మెంబర్ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలోఅన్నదానం చేశారు.కార్యక్రమంలో కమిటి సభ్యులు గోవింద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామచంద్రయ్యగౌడ్, అరుణ, గుడిసె శేఖర్, రాజప్ప, రామాంజనేయులు, దొరోల్ల కృష్ణయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, నిమ్మకాయల హనుమంతు, తిరుపతి, శివారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# వైభవంగా స్వామి వారి కళ్యాణమహోత్సవం

- సాంప్రదాయరీతిలో అమ్మవారి తలంబ్రాల ఘట్టం
- అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారి దంపతులు
- భక్తిపారవశ్యంతో పులకించిన భక్తులు


అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివారు

**దేవరకద్ర,డిసెంబరు26 ప్రభాతవార్త:** మన్యంకొండ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి కళ్యాణమహోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. ప్రతి పౌర్ణమి రోజు స్వామి వారి కళ్యాణమహోత్సవాని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని కన్నుల పండులా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న మండపం స్వామి వారిని పల్లకిలో తీసుకవచ్చారు. అనంతరం స్వామి వారి కళ్యాణమహోత్సవాన్ని సాంప్రదాయ రీతిలో ప్రారం భించారు. ఈ సందర్భంగా పురోహితుల వేధమంత్రాల మద్య అమ్మ వారి మంగళసూత్రధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాం తాల నుండి తరలి వచ్చిన భక్తులు అమ్మవారి ఈ కళ్యాణ


కళ్యాణమహోత్సవానికి హాజరైన భక్తులు

ధారణ తిలకించిభక్తి పారవశ్యంతో పులకించిపోయారు. భక్తుల హరినామశ్చరణతో కళ్యాణమహోత్సవంజరిగే ప్రాంతంమారు మోగింది. అలాగే ఆచారం ప్రకారం స్వామి దంపతుల తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి దంపతులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలనునిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామిదంపతులు:** మన్యంకొండలో కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి దంపతులు దేవస్థానం ఆవరణలో ఊరేగుతూ అలంకరణలోభక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాలపూలు, బంగారు ఆభరణాలతో స్వామిదంపతులను అలంకరించారు. ఆ కార్యక్రమాన్ని కనులారా తిలకించడానికి జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్య క్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసిం హ్మయ్య, పాలక మండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిపిఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**బిజినేపల్లి,డిసెంబరు 26 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పి. కృష్ణాజీ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి పార్టీ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన మొట్టమొదటి పార్టీ సిపిఐ అన్నారు. 1925 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్‌లో సిపిఐ పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. ప్రతి నిత్యం సిపిఐ పార్టీ పేదప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మంగంపేట శ్రీను, బుగ్గనాగన్న, నారాయణ, యాదయ్య, బొందయ్య, హుస్సేన్, మోహన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


సిపిఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నాయకులు

**వనపర్తి టౌన్,డిసెంబర్ 26,ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రం పార్టీ కార్యాలయంలో సిపిఐ 98వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.రాజనగరం గ్రామ శాఖ కార్యదర్శి సిపిఐ జిల్లా కార్యాలయంపై అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ సహాయ పై అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్రకురుమయ్య మాట్లాడారు. 1925 డిసెంబర్ 26న పార్టీ పుట్టిందన్నారు. ఎన్నో ప్రజా సమస్యలు సిపిఐ పోరాటంతో పరిష్కారం అయ్యాయన్నారు. పేదలకు భూములు, ఇండ్ల స్థలాలు, ఇండ్లకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. ఎక్కడ ప్రజలకు అన్యాయం జరిగితే అక్కడ ఎర్రజెండా తోడుగా ఉంటుందన్నారు. పేదలు, బాధితుల పక్షాన నిలబడుతుందన్నారు. గ్రామాల్లో సిపిఐని బలోపేతం చేసుకోవాలన్నారు. నాయకులు కృష్ణయ్య, రమేష్, బాలీశ్వరమ్మ, రాంబాబు, జి కృష్ణయ్య, దాసు, ఏఐఎస్ఎఫ్ నాయకులు భాను ప్రకాష్, వెంకటేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# జాతరలో భక్తులు అప్రమత్తంగా ఉండాలి

**మక్తల్,డిసెంబరు 26 ప్రభాతవార్త:** మక్తల్ శ్రీ పడమటి ఆంజనేయస్వామి జాతర సందర్భంగా పోలీస్ కళాబృందం వారు జాతరలో ముందస్తు దొంగతనాలు జరగకుండా, భక్తులు అప్రమత్తంగా ఉండాలని, తమ విలువైన వస్తువులు, సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు, పర్సులు, బ్యాగులు మొదలైన వస్తువులు దొంగతనాలు కాకుండా అప్రమత్తంగా ఉండాలని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వసంత మాట్లాడుతూ జాతరకొచ్చిన భక్తులు అప్రమత్తంగా ఉండాలని ముందస్తు నేరాలు జరగకుండా జాగ్రత్త పడాలని తమ విలువైన వస్తువులకు జాగ్రత్తగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే జాతరలో చిన్న పిల్లలు, పెద్దవారు తప్పిపోకుండా జాగ్రత్తగా చూసుకోవాలని అలాగే ఎవరైనా జాతరలో అను మానాస్పదంగా ఉంటే దగ్గర్లోని పోలీసు వారికి లేదా డయల్100కి కాల్‌చేసిసమాచారం ఇవ్వాలనిఎస్సై తెలిపారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, కళ్యాణి పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎస్సై వసంత

# ప్రజా పాలనను అధికారులు పకడ్బందీగా చేపట్టాలి

**ఇటిక్యాల,డిసెంబరు 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్‌లు అపూర్వ చౌహాన్, చీర్ల శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి సమావేశం హాల్‌లో ప్రజాపాలన కార్యక్రమం అమలుకు రూపొందించ వలసిన ప్రణాళికపై సంబంధిత జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ మాట్లాడుతూ డిసెంబర్ 28వ తేదీ నుండి జనవరి 6వ తేదీ వరకు చేపట్టనున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజల చెంతకు తీసుకువెళ్లేందుకు పక్కా ప్రణాళిక రూపొందించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని అధికారులకు సూచించారు. మహా లక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు మొదలగు పథకా లకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామసభ నిర్వహణపై డప్పు చాటింపు ద్వారా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. దరఖాస్తుదారునికి రసీదు అందించాలని, ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డులో ప్రజాపాలన సభల నిర్వహణకు ఇంఛార్జిలను ఏర్పాటు చేయాలని గ్రామసభలలో ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలి, కౌంటర్లలో ఎవరు విధులు నిర్వహించాలని మొదలుకొని ప్రతి అంశం ప్రణాళిక బద్ధంగా జరిగేలా చూడాలని, సంబంధిత సిబ్బందికి ముందస్తుగానే విధులు అప్పగిస్తూ ప్రొసీడింగ్స్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్‌ను ప్రతి పంచాయతీలో ఏర్పాటు చేయాల న్నారు. చిన్న గ్రామ పంచాయతీలో ఉదయం, సమావేశం, పెద్ద గ్రామ పంచా యతీలో ఉదయం, మధ్యాహ్నం రెండు


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్లు

సమావేశాలు నిర్వహించడం జరుగు తుందన్నారు. దరఖాస్తులను ప్రభుత్వమే ప్రజలకు అందజేస్తుందని ప్రజా పాలనపై ప్రతి గ్రామంలో మున్సిపల్ వార్డులలో విస్తృత ప్రచారం చేపట్టాలని ఒకరోజు ముందుటా టామ్ టామ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభలు జరిగే ప్రాంతంలో హెల్త్ క్యాంపులు, త్రాగునీరు, టెంట్లు, కౌంట ర్ల కోసం టేబుల్స్, స్టేషనరీ, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ సభ లలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద క్యూలైన్ విధానం పాటించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేరపోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేసి ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ చీర్ల శ్రీనివాస్, అడిషనల్ ఎస్‌పి రవి, ఆర్డీఓ చంద్రకళ, ఎస్‌డిసి సుబ్రహ్మణ్యం, జడ్పీ సీఈఓ కాంతమ్మ, ఎంపిడిఓలు, అన్ని మండలాల తహసిల్దార్‌లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భగీరథ భారత జన కళ్యాణ యాత్రకు ఘన స్వాగతం

**కృతజ్ఞతలు తెలిపిన సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్ చందర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 26 ప్రభాతవార్త:** భగీరథ భారత జన కళ్యాణ యాత్ర మంగళవారం పాలమూరు జిల్లాకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఘనంగా స్వాగతం పలికిన మహబూబ్‌నగర్ జిల్లా సగరులందరికి సగర సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ప్రణీల్ చందర్ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా భారతదేశం మొత్తం సగరుల ఐక్యత కొరకు నడుం బిగించి తిరుగుతున్న హరీష్‌చౌహాన్, వెంకట్రావు, ఉదయ్ సాగర్ల బృందం సభ్యులందరికి హృదయపూర్వ ధన్యవాదాలు తెలిపారు. భారతదేశంలో నివసిస్తున్న సగరులను ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారని కాబట్టి సగరులు ఐక్యతగా ఉండలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సగరులఐక్యత తెలియజేయాలని, భారతదేశంలో 15నుంచి20 కోట్ల జనాభా ఉన్న సగరులకు ఆర్థికంగా, సామాజికంగా ప్రభుత్వం అండగా ఉండాలనియాత్ర ముఖ్యఉద్దేశమని తెలి పారు. రాబోవు ఫిబ్రవరిలో రామ్‌లీలామైదానంలో సగరులయొక్క సింహ గర్జనసభకు పెద్దఎత్తునతరలిరావాలని ఈ సందర్భంగా అందరిని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు


యాత్ర నిర్వాహకులకు స్వాగతం పలికిన జిల్లా సగర సంఘం నాయకులు

## అర్హులైన వారందరికి ఆరు గ్యారెంటీలు

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్26, ప్రభాతవార్త:** మున్సిపాలిటి, గ్రామాల్లో ఉన్న అర్హులైన ప్రజలందరికి రాష్ట్ర ప్రభుత్వం అందించేందుకు ఈ నెల 28 నుండి ప్రజా పాలన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, మలిదశ ఉద్యమ కారులు, వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్, కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా అర్హులైన వారందరిని గుర్తించడం జరుగుతుందన్నారు.

## వనపర్తి ఎమ్మెల్యేని కలిసిన కానిస్టేబుల్ అభ్యర్థులు


వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

**వనపర్తి టౌన్,డిసెంబర్ 26,ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కానిస్టేబుల్ అభ్యర్థులు జీవో నెంబర్ 46 రద్దు గురించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ప్రభుత్వం జీవో నెంబర్ 46 రద్దు గురించి సానుకూలంగానే ఉంది అని హామీ ఇవ్వడం జరిగింది.

## ఎమ్మెల్యేతో భేటీ అయిన నారాయణనాయుడు



**ఇటిక్యాల,డిసెంబరు 26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండేరు శివారులో గల ఉడిపి హోటల్‌లో ఆ భవనం యజమాని నారాయణ నాయుడు మర్యాదపూర్వకంగా ఏర్పాటు చేసిన తేనేటి విందులో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పాల్గొని స్వీకరించారు. ఈ సందర్భంగా సమావేశమై పలు అభివృద్ధి విషయాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో నారాయణనాయుడు, అలంపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రఘురెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధ్యక్షులు గోపాల్ ఆయనతో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**జడ్చర్ల,డిసెంబరు 26 ప్రభాతవార్త:** బాదేపల్లి పట్టణంలో మంగళవారం గోనెల వాణిశ్రీ జ్ఞాపకార్థం అనాధ మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. సేవలో ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మానసిక వికలాంగులకు, అనాధలకు పేదవాళ్లకి వృద్ధులకు పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోనెల రవి శంకర్, సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, అనిత, పింకి సిబ్బంది పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పియు జట్ల పయనం

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 26 ప్రభాతవార్త:** సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఆల్ ఇండియా పోటీలకు పియు మహిళల జట్టు మంగళవారం పయనమైంది. పాలమూరు విశ్వ విద్యాలయానికి చెందిన మహిళలు వాలీబాల్ జట్టు పద్మావతి యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పాలమూరు యూనివర్సిటి పిడి వై. శ్రీనివాసులు తెలిపారు. ఈ పోటీలు నేటినుంచి రెండు రోజులపాటు జరగనున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులకు వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య ట్రాక్‌సూట్, టీం యూనిఫామ్ అందజేశారు. విజయం సాధించి తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిడివై శ్రీనివాసులు, కోచ్ చిన్న వీరయ్య, సుచేతన్‌రెడ్డి గాలయ్య, కథలప్ప, చామంతి పాల్గొన్నారు.

## నేడు మహాపడిపూజ, ఆభరణాల ఊరేగింపు

**జడ్చర్ల,డిసెంబరు26 ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలో అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు, మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గురుస్వాములు తెలిపారు. పట్టణంలోని పద్మావతి కాలనీలోని దాచేపల్లి చంద్రయ్య ఇంటి నుంచి పట్టణ పురవీధుల గుండా ఆభరణాల ఊరేగింపు నిర్వహించి అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుకోనున్నారు. మహాపడిపూజ కార్యక్రమంలో పట్టణ భక్తులందరు పాల్గొని స్వామివారి ఆశీస్సులు తెలిపారు. మహాపడిపూజ కార్యక్రమం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

## దేవాలయాన్ని సందర్శించుకున్న ఎస్పి



**మల్దకల్, డిసెంబర్26, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా ఎస్పీ రితి రాజ్ మంగళవారం మల్దకల్ శ్రీస్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహల్లాదరావు ఈవో సత్య చంద్రారెడ్డి ఎస్పీకి ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు చేయించారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రం స్వామి వారి చరిత్ర పుస్తకం అంద జేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బ్రహ్మో త్సవాలలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎక్కడ ఎలాంటి సమస్య రాకుండా సిబ్బంది బందోబస్తు పర్యవేక్షిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్వాల డిఎస్పి వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్సై కళ్యాణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా బాక్సింగ్ డే

**జడ్చర్ల, డిసెంబరు 26 ప్రభాతవార్త :** జడ్చర్ల పట్టణంలోని బేతని ఎంబి చర్చి యూత్ కమిటి ఆధ్వర్యంలో మంగళవారం క్రీడల పోటీలను నిర్వహించారు. బాక్సింగ్ డే సందర్భంగా వాలీబాల్, కబడ్డీ, షాట్‌పుట్ చిన్నారులకు రన్నింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నప్పటి నుంచే, విద్యార్థి దశ నుంచే ఫిట్నెస్ అలవాటు చేసుకోవాలని, శారీరక శ్రమతోనే ఆరోగ్యంగా ఉంటారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ రెవరెండ్ కె. విలియం, బూత్ అధ్యక్షులుఫిలమోను, కార్యదర్శి తిమోతి, కమిటి సభ్యులు పరంజ్యోతి, దేవదానం, జయపాల్, జాన్, యూత్ అధ్యక్షులు గడ్డం సందీప్, కార్యదర్శి బన్నిరాజ్, కోశాధికారి సుష్మిత్, చెర్రీ, అరుణ్, వ్యాయామ ఉపాధ్యాయులు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.


చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

## దేవరకద్రలో వైభవంగా అంజన్న రథోత్సవం

- ముగిసిన ఆంజనేయస్వామి ఉత్సవాలు
- అలంకరణలో స్వామివారి దర్శనం



దేవరద్రలో రథోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు



అలంకరణలో స్వామివారి మూలవిగ్రహం

**దేవరకద్ర,డిసెంబరు26 ప్రభాతవార్త:** దేవరకద్రలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవాలలో భాగంగా మంగళవారం తెల్లవారు జామున స్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది స్వామివారి ఉత్స వాలను పట్టణప్రజలు అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ స్వామివారి ఉత్స వాలలో భాగంగా ఈ పవిత్ర ప్రధాన ఘట్టమైన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిగ్రహాన్ని శోభాయమానంగా అలంకరించి రథ ంపై పట్టణ పురవీధులగూండా ఊరేగించారు. పురోహితుల వేధమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినిమశ్చరణల మధ్యఈ రథం ముందుకు కదిలింది. పట్టణంలోని వివిధ కూడళ్ళ వద్ద భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా స్వామివారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. అనంతరం మళ్లీ స్వామి వారిని దేవ స్థానంలోకి తీసుకవచ్చిపూజలు నిర్వహించారు. దేవస్థానంలో వేదమంత్రో శ్చరనల మధ్యఆపవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి రథోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

**అలంకరణలో స్వామివారి దర్శనం:** ఉత్సవాల సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌నువివిధ రకరకాల పూలతో పాటువివిధ ఆభరణాలతో సర్వాంగ సుంధరంగా అలంకరించారు. దీంతో అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారిమూల విగ్రహాన్ని కూడ రకరకాలపూలు,వివిధ ఆభరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసి అలంకరించారు. అలాగేస్వామివారికిపూజారులు శ్రీనివాస చారి, ప్రాణేశ్‌చారి, సంజీవ చారిల అధ్వర్యంలో అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణప్రజలు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారికి వివిధ పూజలునిర్వహించారు. భక్తులకు అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



రథోత్సవంలో భజనలు చేస్తున్న భక్తులు

# మళ్లీ కోరలు చాస్తున్న కరోనా..!

- రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం..
- హైదరాబాద్‌లో కేసులు నమోదుతో ఆందోళన
- జిల్లాలకు పొంచి ఉన్న ముప్పు..
- ఇప్పటికే ఎలాంటి పాజిటివ్ జీరో..
- మాస్క్ తప్పనిసరి అంటున్న వైద్యులు





**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** ప్రపంచాన్ని కుదిపేసిన కొవిడ్ భూతం మళ్లీ సామాన్యులను భయ బ్రాంతులకు గురిచేస్తున్నది. గత కొన్ని నెలలుగా బ్రేక్ ఇచ్చినా మళ్లీ కొవిడ్ అనే పదం వినిస్తుండడం జనాలు ఆందోళన చెందు తున్నారు. గత వారం కిందట కేరళలో వెలుగుచూసిన కొవిడ్ జేఎన్-1 వేరియంట్ కేసులు హైదరాబాద్‌లోనూ నమోదు కావ డంతో రాష్ట్రం వైద్యశాఖను అప్రమత్తం చేసింది. ఈమేరకు కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. కొవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాల ని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం కొవిడ్ అప్రమత్తతపై జిల్లాల కలెక్టర్లకు సూచనలు చేసింది. ఈక్రమంలో ఆయా జిల్లా దవాఖా నల్లో ప్రత్యేక వార్డుల ను ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు అధికారు లు చెబుతున్నారు. దీంతో ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ టెస్టుల సంఖ్య ను కూడా పెం చనున్నారు.

**పరీక్షలు నిర్వహిస్తేనే..**

అయితే గతంలోనూ కొవిడ్ భూతం జనజీవనాన్ని స్తంభింపజేసి న సంగతి తెలిసిందే. అయితే ఇటీవల కేరళలో కేసులు నమో దు కావడంతోపాటు కొత్త వేరియంట్ అందరినీ కలవరపెడు తున్నది. ఈ వేరియంట్ ప్రభావంతో ప్రాణాలకు ముప్పు పొంచి ఉండడంతో భయాందోళన చెందుతున్నారు. అయితే కేసులు నమోదు కాకుండా వ్యాప్తిని అరికట్టాలంటే కేవలం పరీక్షలు పెం చడమే ఏకైక మార్గమని అధికారులు భావిస్తున్నారు. దీంతోపా టు శబరిమళ వెళ్లి వచ్చిన భక్తుల వివరాలు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో పాజిటివ్ కేసులు నమోదు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలను అలర్ట్ చేసింది. జిల్లాలో టెస్టుల సంఖ్య పెంచాలని సూచించింది. ఎలాంటి విపత్తు ఏర్పడినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించింది. ఈమేరకు కలెక్టర్ల స్థాయిలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని దవాఖానలో టెస్టుల కిట్లు, మాస్కులు, సంబంధిత పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**అప్రమత్తత అవసరం..**

కొవిడ్ వ్యాప్తి తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. బయటికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి మాస్కు ధరించాలని చెబుతున్నారు. అయితే వాతావరణం దృష్ట్యా మార్పులు చోటుచేసుకున్న నేప థ్యంలో దవాఖానకు కిటకిటలాడుతున్నారు. శ్వాససంబంధమైన వాధ్యులతోపాటు సీజనల్ వ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉన్నది. ఈక్రమంలో ఏది కొవిడ్ వైరస్, ఏదీ కాదు అని తేల్చుకోలేకపో తున్నారు. అయితే రెండు,మూడు రోజులకు మించి దగ్గు, శ్వాస సంబంధమైన ఇబ్బంది కలిగితే తప్పనిసరి టెస్టులు చేయించుకో వాలని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం జేఎన్-1 కొవిడ్ వేరియంట్ వ్యాపిస్తున్న నేపథ్యంలో దగ్గుజలుబు ఉన్న వారు ఇంటికే పరిమితం కావాలని సూచిస్తున్నారు. కొత్తవైరస్ పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

**ఇప్పటికీ పాజిటివ్ కేసులు లేవు..**

మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ప్రధాన దవాఖానలో ప్రత్యేక కొవిడ్ వార్డు ఏర్పాటు చేశాం. వైరస్‌ను ఎదుర్కొనేందుకు అన్ని రకాల సిద్ధంగా ఉన్నాం. కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు, ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహిస్తాం. ఇప్పటికీ ఏడుగురికి టెస్టులు నిర్వహిస్తే ఎలాంటి పాజిటివ్ రాలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండడం ఎంతైనా అవసరం. బయటకు వెళ్లినప్పుడు మాస్కు ధరించి ప్రయాణాలు కొనసాగిస్తే మంచిది.

*- డా.జీవన్, మహబూబ్‌నగర్ జనరల్ ప్రధాన దవాఖాన, సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్*

# కమ్మేస్తున్న పొగమంచు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- కాశ్మీర్‌ను తలపించిన రహదారులు



జడ్చర్ల పట్టణంలో రోడ్లను కమ్మేసిన పొగమంచు

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 26 ప్రభాతవార్త:** గత రెండు మూడు రోజులుగా వాతావరణం మరింత చల్లబడడంతో జనాలు గజగజ వణుకుతున్నారు. ఉదయం 10 గం.లు దాటిన చలి తీవ్ర తగ్గకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామున రోడ్లను పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పలుచోట్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చేటుచేసుకోవడంతో పిల్లలు వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. శ్వాసకోశ సంబంధ వ్యాధిగ్రస్తులు బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. తాండూరు మండలం నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్నఆర్టీసి బస్సు పొగమంచు కారణంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని మహ్మదాబాద్ మండలం ఇబ్రహీంబాద్ వద్ద అదుపు తప్పి గుంతలోకి దూసుకెళ్లింది. పొగమంచుకు తోడు రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. ప్రయాణీకులను డ్రైవర్ వేరే బస్సులోకి ఎక్కించారు. వాహన చోదకులు నెమ్మదిగా వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు.





ఇబ్రహీంబాద్ వద్ద అదుపు తప్పి గుంతలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



జడ్చర్ల పట్టణంలో రోడ్లను కమ్మేసిన పొగమంచు

## సర్పంచ్ ఎన్నికలపై ఊహాగానాలు..!

### ఏర్పాట్లలో అధికారం యంత్రాంగం.. పోటీకి సిద్ధమవుతున్న నేతలు



**భూత్పుర్,డిసెంబరు 26 ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల సమరం నుంచి ఇంకా పూర్తిగా తేరుకోక ముందే సర్పంచ్ ఎన్నికలపై ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. జనవరి 31, 2024తో ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవి కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలతో జిల్లా పంచాయతీ శాఖ ఎన్నికల ఏర్పాట్లపై నిమగ్నమైంది. మరోవైపు జనవరి 31, 2019న గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఫిబ్రవరి 2న పదవి బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తమకు చెప్పరు ఆరు నెలలు ఆలస్యంగా ఇచ్చినందున మరో ఆరు నెలల తర్వాత ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదిలా ఉంటే జనవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని డిసెంబర్ చివరి వారంలో షెడ్యూల్ విడుదల చేసి జనవరి 7న నోటిఫికేషన్ వస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో నాయకులు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించడం ప్రభుత్వం తీసుకుని నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు ఊహాగానాలేనని కొందరు చెబుతున్నారు. నవంబర్ 30 అసెంబ్లీ ఎన్నికలు జరగగా డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు వెల్లడించి న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుపొంది రాష్ట్రంలో కొత్తగా రేవంత్‌రెడ్డిలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కూడా కాకముందే సర్పంచ్ ఎన్నికలు జనవరిలో జరుగుతాయని వస్తున్న వార్తలతో గ్రామాల్లో అప్పుడే మళ్లీ ఎన్నికల వాతావరణం నెలకొన్నది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రభుత్వం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఎన్నిక లను నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నది.

**ఏర్పాట్లలో అధికార యంత్రాంగం:** నిర్ణీత వ్యవధి ప్రకారం గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణ దిశగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అవసరమైన ప్రక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. ఆయా పంచాయతీల వారిగా గతంలో అనుసరించిన రిజర్వేషన్ల వివరాలను ఇదివరకే మండలాల వారిగా పంపించారు. ఈసారి అందుబాటులో ఉన్న ఓటరు జాబితాను సరిచేసే పనిలో సిబ్బంది ఉన్నారు. ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో పంచాయతీల వారిగా ఓటర్లలో చాలామంది మరణించిన వారిని తొలగించలేదు. పైగా కొన్నిచోట్ల కొత్తగా ఓటర్లు చేరాల్సి ఉంది. ఇందుకోసం ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం తుది జాబితాను సిద్ధం చేయనున్నారు.

## సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పియు జట్ల పయనం



**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 26 ప్రభాతవార్త:** సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఆల్ ఇండియా పోటీలకు పియు మహిళల జట్టు మంగళవారం పయనమైంది. పాలమూరు విశ్వ విద్యాలయానికి చెందిన మహి ళలు వాలీబాల్ జట్టు పద్మావతి యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొ నను న్నట్లు పాలమూరు యూనివర్సిటి పిడి వై.శ్రీనివాసులు తెలిపారు. ఈ పోటీలు నేటినుంచి రెండు రోజుల పాటు జరగనున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులకు వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణయ్య ట్రాక్‌సూట్, టీం యూనిఫామ్ అందజేశారు. విజయం సాధించి తిరిగి రావాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో పిడివై శ్రీనివాసులు, కోచ్ చిన్న వీరయ్య, సుచేతన్‌రెడ్డి గాలయ్య, కథలప్ప, చామంతి పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE
V ADDL. DISTRICT JUDGE
RANGA REDDY DISTRICT
AT :: L.B. NAGAR
O.S. No. 66 OF 2023

BETWEEN:-
**A.Sudhakar Reddy @ Ashok Reddy ...Plaintiff**
AND
**Golla Rama Raju & 4 others ...Defendants**

To,
**1. Golla Lalitahmma,** W/o. late Balraj, (D-2) Age about 73 years, Occ: House Wife, R/o. H.No.25-54/2, Vijaynagar Colony, Shadnagar, Farooqnagar (Vill & Mandal), Ranga Reddy District.
**2. Golla Rama Raju,** S/o. late Balraj, (D-3) Age about 41 years, Occ: Business, R/o. H.No.3-58/3/A/B, Vijaynagar Colony, Shadnagar, Farooqnagar (Vill & Mandal), Ranga Reddy District.

It is to inform you that the plaintiff has instituted the above suit against you and others seeking for the relief of perpetual injunction pertaining to the his immovable property and you are the Defendant No.2 & 3 in the above suit and the summons are not being served on you in spite of sending of summons to you several times and the above said suit is stood posted to **11.01.2024.** Therefore you are hereby informed to appear before the above said Hon'ble Court **on 11.01.2024 at 10.30 a.m.,** either in person or duly instructed by your counsel. Otherwise the above said will be decided in your absence by the above said Hon'ble Court.

By order of the Court
**Sd/- GAJJALA VENKATA REDDY**
**Advocate**
Plot No.80/B, H.No.11-13-177/1, Road No.3, Green Hills Colony, Kothapet, Hyderabad-500102
**Cell No: 9989286688**

## ట్రాఫిక్ చాలాన్ల చెల్లింపు రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

**వెల్దండ, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాల చెల్లింపులకు రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అవకాశాన్ని కల్పించిందని, ఈ అవకాశాన్ని వాహనదారులు వినియోగించుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ నెల 26 నుంచి జనవరి 10 2024వరకు పెండింగ్ చాలాన్ల డబ్బులు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. ద్విచక్రవాహనాల చాలాన్లకు 80శాతం,ఆటోలు, ఫోర్ విల్లర్స్‌కు 60శాతం, భారీ వాహనాలకు 50శాతం రాయితీలను ప్రభుత్వం కల్పించిందని,ఇట్టి అవకాశాన్ని మండలంలోనివాహనదారులు సద్వినియోగం చేసుకొని చాలాన్లను చెల్లించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, మైనర్లకు వాహనాలు అప్పగించ రాదన్నారు. వాహనదారులుఖచ్చితంగానిబంధనలుపాటించాలని సూచించారు.

# కన్నుల పండువగా పడమటి అంజన్న రథోత్సవం

- రాష్ట్ర, అంత రాష్ట్రాల నుంచి అశేషంగా తరలివచ్చిన భక్తజనం
- స్వామిని దర్శించుకున్న పలువురు రాజకీయ ప్రముఖులు
- దగ్గరుండి రథాన్ని లాగిన ఎమ్మెల్యే



స్వామివారి రథోత్సవం

**నారాయణపేట ప్రతినిధి,డిసెంబరు 26 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మక్తల్ మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీపడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు గత రెండు రోజులనుంచి రాష్ట్ర అంత రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తు స్వామివారిని దర్శించుకుంటున్నారు. రెండవ రోజు రథోత్సవాన్ని చూడడానికి అనూహ్యంగా జనాలుతరలివచ్చారు. ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న పూజలను కార్య క్రమానికి స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దగ్గరుండి పర్యవేక్షించారు. స్వామివారి దేవాలయం నుండి పురవీధుల గుండా స్వామివారి రథోత్స వాన్ని లాగుతూ జై హనుమాన్ జైజై హనుమాన్ రామలక్ష్మణ జానకి అని నినాదాలతో మక్తల్ పులకించింది. స్వామివారికి ముందుగా స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం నుండి పట్టు వస్త్రాలను మేళ తాళాల మధ్య స్వామి వారికి పట్టు వస్త్రాలను మున్సిపల్ ఛైర్మన్ సమర్పించారు. దర్శించుకున్న వారిలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, నారాయణపేట జడ్పీ ఛైర్మన్ వనజ ఆంజనేయులుగౌడ్, భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షురాలు డికెఅరుణమ్మ,మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తనయుడు సిద్దార్థరెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలంధర్‌రెడ్డి, కొండయ్యతో పాటు నక్కల్ మున్సిపల్ కౌన్సిలర్లు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున స్వామివారి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు





స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు



స్వామివారికి సమర్పించడానికి నైవేద్యాలు చేస్తున్న మహిళలు